# ఎత్తుకు పై యెత్తు

సాయంకాలం నాలుగవుతోంది. ఓ ఫ్రెండుని రైలుకి దిగబెట్టాను. ఇంటికి వెళ్ళిపోవడమా, క్లినిక్‌లో కూచోడమా అని ఆలోచిస్తూ క్లినిక్‌వేపు పోనిచ్చాను స్కూటర్ని. క్లినిక్ తెరవడాని కింకా అరగంట పైగా టైముంది. ఇంటి కెళితే అరలీటరు పెట్రోలు ఖర్చవుతుంది. అరలీటరు పెట్రోలా, అరగంట టైమా; ఏది దండగపెట్టడం సుళువు? నిర్ణయానికి వొచ్చేలోపుగానే క్లినిక్‌కి వొచ్చేశాను.

నా క్లినిక్‌కి ఎదురుగా వో కారు ఆగివుంది. అందులో ఎవరున్నారో తెలీలేదు. పక్కని డ్రయివరు నిలబడున్నాడు. కారు నెంబరును బట్టి అది ఈ వూరిది కాదని గ్రహించాను.

ఏదో కేసన్నమాట! టైమూ, పెట్రోలూ ఏ దండగా లేదు. పైగా ఆదాయం రావచ్చు- అనుకున్నాను.

నారాయణగాడు (నా అటెండరు) క్లినిక్ తాళం తియ్యలేదు. అటు చూస్తూ స్కూటర్ని దాని స్థానంలో ఆపి, ఆ కారు డ్రయివరు వేపు చూశాను.

"డాక్టరుగారు తమరేనాండి?" అడిగాడు.

"అవున్నేనే- ఏమిటి సంగతి?"

"సూర్యప్రభగారు సిక్కయ్యారండి, తమరోసారి చూడాలి."

సూర్యప్రభ అన్నపేరు వినగానే ఆ కారు అర్థమైపోయింది. "ఏమిటి? ఏక్ట్రెస్ సూర్యప్రభగారే?"

"మరేండి."

"తీసుకురండి" అని డ్రయివర్ని కూడా క్షమించేను (అదే, మన్నించేను!) ఎందుకైనా మంచిదని, నా దగ్గిరున్న తాళం చెవితో క్లినిక్ తలుపు క్లిక్ మనిపించేను.

కారు వెనకసీట్లో వున్నంట్టుందామె. తలుపులకున్న అద్దాలు, చాలా ముదరరంగులో వున్నందువల్ల లోపల అసలు మనిషి వున్నదీ లేందీ తెలీలేదు. అది సినిమా తారలకీ అవసరమే. లేకపోతే ఫాన్లు ఎక్కువై ఆ గాలికి ఎంతటి తార అయినా ఎగిరిపోవడం, కొండొకచో రాలిపోవడం తథ్యం.

క్లినిక్‌లో సూర్యప్రభ అడుగుపెట్టగానే (అంతకు ముందే నేను ట్యూబులైటు స్విచ్ వేసినందువల్ల, కరెంటు సప్లయి ఆగిపోనందు వల్ల;) కన్‌సల్టింగ్ రూము, ఎగ్జామినేషన్ రూము వెలుతురుతో, కాంతితో ధగధగ లాడాయి.

ఉస్సురంటూ సూర్యప్రభ "ఎక్కడ?" అన్న ప్రశ్న కళ్ళలోకి తెచ్చుకుని నిలబడిపోయింది.

వెనకాలే వచ్చిన డ్రయివరు "రాత్రినుంచీ తిన్నది అరగడం లేదండి. ఇవాళ పొద్దుట్నించి వట్టి మంచినీళ్ళు తాగలేదండి" అన్నాడు.

"సరే లోపలికి పదండి" అని సూర్యప్రభకీ, "మీరు బయట వుండండి" అని డ్రయివరుకీ చెప్పి సూర్యప్రభని లోపలికి తీసుకెళ్ళి బల్లమీద ఏర్పాటుచేసిన బెడ్ మీద పడుకోమన్నాను.

తన బాధ గురించి సూర్యప్రభ చెబుతూ వుంటే, కళ్ళూ చెవులే కాక ముక్కు కూడా పనిచేసింది. నాకు సూర్యప్రభ ఇవాళ ఉదయం నుంచి వట్టి మంచినీళ్లు తాగడంలేదని, అందులో ఏదో కలుపుకునే త్రాగిందనీ అర్థమైంది.

చెయ్యి పట్టుకుని పల్స్ చూశాను.

స్టెత్‌తో హార్టుబీట్ చూద్దామని ప్రయత్నించేను. స్టెత్ పెట్ట డానికి ఎక్కడా ఖాళీ జాగా దొరక్క చాలా ఇబ్బందైంది.

"ఏమిటి చేస్తున్నారు?" అనడిగింది సూర్యప్రభ మత్తుగా, గమ్మత్తుగా.

"టెస్టు చేదామని ప్రయత్నిస్తున్నాను."

"టెస్టు చేదామనా, టేస్టు చూదామనా ?"

"మీరలా గనడం బావులేదు'' అన్నాను తొలిగి.

"మీరిలా చైడం బావుందా ?'' అని చటుక్కున లేచికూర్చుంది. ఇంతసేపు జబ్బు నటిస్తున్న సూర్యప్రభ.... స్టెత్ పెట్టడానికని అంతకు ముందు కొద్దిగా తొలగించిన పయట ఆమె హఠాత్తుగా లేచి కూర్చో డంలో భుజంమీద నిలబడక జారిపోయింది. అది తీసి భుజంమీద వేసుకోకుండానే సూర్యప్రభ మాట్లాడింది.

"ఆడది కనబడితే చాలు, మొగాళ్ళందరికీ ఒకటే బుద్ధి. డాక్టర్లు మరీనూ! ముందు చెయ్యి పట్టుకున్నారు. నేనేమీ అడ్డుపెట్టలేదు కదా అని కాబోలు, బుగ్గలమీద వేళ్లుపెట్టి నిమిరారు. దానికీ నేనేం అనలేదు కదా అని ఏకంగా.''

"ఆగం డాగండి —'' అన్నాను కొంచెం గట్టిగానే. "నేను డాక్టర్ని. (డైరెక్టర్ని కాదు) వృత్తిరీత్యా ఆడ మగా తేడా లేకుండా చేతులు పట్టుకుంటాను; గుండెలమీద స్టెత్తుపెట్టి తణికీ చేస్తాను. అయితే, హార్టు బీటు చూస్తామేగాని స్టెత్తుతో గుండెలమీద ఎత్తుల జోలికిపోము. అలా అనుకున్న వాళ్ళకి గుండె లేదన్నమాట. మీరు మొగాడయినా అంతే. ఆడదయినా అంతే. సినిమా తార అయినా అంతే !''

"అదేంకాదు.'' అంది సూర్యప్రభ, ఇంకా పయట సర్దుకోకుండానే. "మీలాంటి డాక్టర్లుంటారనే ఈమధ్య డాక్టర్లని విలన్లుగాపెట్టి రాణీరామేశ్వరీ కొండంత వెలుగు బేవనమ్మ అని మూడు సినిమాల్లో చూపించేరు, జనాన్ని మేల్కొలపడానికి.''

"మిమ్మల్ని భగవంతుడు కూడా బాగుచైలేడు.'' అంటూనే నామె దగ్గరగా వెళ్ళాను. ఎగ్జామినేషన్ టేబిల్‌మీద నుంచి కిందికి వేళ్ళాడుతున్న ఆమె పయటతీసి ఆమె భుజమ్మీద వేసేను. "సర్దుకోండి, ఇక్కడెవరూ షూటింగు జరపడం లేదు'' అన్నాను.

సూర్యప్రభ నావేపు కోరగా చూసింది.

"మీరు సినిమాలు చూసి చెడిపోతున్నారన్నది ఖాయం. మీరు చెప్పిన మూడు సినిమాల్లో సగం నేనూ చూసేను. అంటే - వొక సినిమా పూర్తిగాను; మిగిలిన రెండూ కొంచెం కొంచెం చొప్పునా. కాని, ఆ మూడు సినిమాలు కూడా కనీసం యాభై రోజులయినా ఆడ కండా డబ్బాలు వెనక్కెళ్ళి పోయాయి. అంటే ఏమిటన్న మాటా. మానవాళికి నిజంగానే మంచిచేసే భిషగ్వరులని తప్పుపట్టే చిత్రరాజం తప్పకుండా దెబ్బతింటుంది; వైద్య వృత్తిని పరిహసించే వైద్యులను శంకిస్తూ వచ్చే సినిమాలను జనం మాత్రం ఆదరించరు!'' అన్నాను కవితావేశం తెచ్చుకుని.

"మీ పొయిట్రీ బాగుంది. మీరు మా చిత్రానికి పాటలు రాయ కూడదూ! నేను రికమెండ్ చేస్తాను'' అంది సూర్యప్రభ నవ్వకండా.

బయటనుంచి కారు హారన్ వినిపించింది. బొంగురు గొంతు కతో ఏదో మాట్లాడుతూ వొకాయన లోపలికొచ్చేసి; ''డాక్టరుగారూ'' అన్నాడు. నేను పార్టిషన్ పక్కకొచ్చి ఆయనవేపు చూడగానే ''సూర్య ప్రభగా రున్నారా?'' అంటూ సరాసరి ఎగ్జామినేషన్ రూంలో కొచ్చే శాడు. సూర్యప్రభని చూసి ''ఐందా?'' అన్నాడు.

''అయిందండి, నే చెప్పానుగా! డాక్టర్‌గారు కూడా నా పార్టీయే. అంచేత మన కథ కొంచెం మార్చాలి'' అంది నవ్వుతూ. సూర్య ప్రభ.... నావేపు తిరిగి, ''వీరు మా ప్రొడ్యూసర్ విజయోత్తమరావు గారు. పాంచాలీ ప్రొడక్షన్స్ పేరిట ''నీకు నువ్వూ నాకు నేను'' అనే సాంఘిక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అందులోనూ విలన్ డాక్టరే. అలా వొద్దని, విలన్‌కి మరేదైనా వృత్తి పెట్టమనీ నేను సలహాయిస్తే ఎక్స్‌పర్ట్ వొపీనియన్ కావాలని నన్నిక్కడికి తరిమారు. మీరు మంచి డాక్టరని విన్నాను. మంచి మనిషన్నది చూశాను. మంచి ప్రేక్షకులన్నది తెలుసుకున్నాను'' అని. తన ఎత్తుల్ని వొత్తుగా దాచుకుంటూ ఎత్తయిన ఆ బల్లమీంచి గెంతింది సూర్యప్రభ.

(25-3-78)